క్లుప్తంగా

విద్యాకానుక పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: తుంగభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సోమవారం విద్యాకానుక కిట్లు అందజేశారు. అనంతరం అదే పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో ఫలితాలు సాధించిన వారికి ఆణిముత్యాలు లో భాగంగా ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు, విద్యాకానుక,అమ్మ ఒడి, వసతిదీవెన, విద్యా దీవెన వంటి పథకాలు పేద విద్యార్థులకు వరంగా మారాయని చెప్పారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఆదోని అర్బన్ : పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు రాష్ట్రాల సంప్రదాయ ఆటల పోటీలు సోమవారం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, లగోరీ, గిల్లిదండ, అష్టాచమ్మా, వైకుంఠపాళి, అచ్చింగ నకాయలు, తొక్కుడుబిళ్ల, దాగుడుమూతలు, కుంట వంగు దూకుడు వంటి 12 రకాల ఆటలను ఆడించారు. అనంతరం గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని హనుమాన్ నగర్‌లో రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేకువజాము నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి పూల అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవమూర్తితో రథోత్సవం నిర్వహించారు.

చెరువును స్వాధీనం చేసుకోవాలి

ఆదోని రూరల్ : పాండవగల్లు ప్రభుత్వ పెద్ద చెరువును స్వాధీనం చేసుకోవాలని చెరువు సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమాకు, తహసీల్దార్ వెకంటలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం చెరువు సాధన కమిటీ నాయకులు రామదాసు, కన్వీనర్ యం.తాహెర్‌వలి, వెంకటేష్ మాట్లాడుతూ ఆదోని డివిజన్ కోర్టు, కర్నూలు జిల్లా కోర్టు తీర్పులను సవాల్ చేస్తూ ఆక్రమించిన వారు హైకోర్టులో వేసిన అప్పీల్ సూట్‌ను, స్టే ఆర్డర్‌లను రద్దు చేయాలని కోరారు.

నీటి సమస్య పరిష్కరించండి

కౌతాళం: మండల కేంద్రంలో నెలకొన్న మంచి నీటి సమస్యను పరిష్కారించాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కౌతాళంకు పది నుంచి పదిహేను రోజులకొకసారి నీటిని విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. రాజనగర్ ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఉన్న విద్యుత్ మోటార్ల సరిగా పనిచేయక పోవడం, నిత్యం మోటార్లు కాలిపోతుండడంతో నీటి సమస్య తీవ్రమైందన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

ఆదోని రూరల్ : నాడు-నేడు, జగనన్న విద్యాకానుక పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి యస్.షాబీర్‌బాషా, డివిజన్ అధ్యక్షుడు దస్తగిరి పాల్గొన్నారు.

టెంకాయల టెండరు వాయిదా

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఏడాది పాటు టెంకాయలు హోల్‌సెల్‌గా అమ్మడంతో పాటు అరచిప్పను పోగుచేసుకొనే హక్కు కోసం సోమవారం టెండరు నిర్వహించగా ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణకు నిర్వహించిన టెండరును రూ.2.10లక్షలకు వీరేష్ దక్కించుకున్నాడు. వృథా ఇనుప వస్తువుల కొనుగోలుకు జరిగిన టెండర్‌ను బసవరాజ్ రూ.30వేలకు దక్కించుకున్నాడు. శానిటేషన్ వర్కర్స్ సప్లయ్, ప్రొవిజన్ సప్లయ్ కోసం ఆన్‌లైన్‌లో టెండరు దాఖలయ్యాయని తెలిపారు. అగర్‌బత్తి టెండరు, సప్లయ్ ఆఫ్ ప్రసాదం లేబర్ టెండర్, చెప్పుల స్టాండ్‌కు, సప్లయ్ ఆఫ్ ప్లంబింగ్ మేరిటియల్స్ టెండరుకు పాటదారులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆమె చెప్పారు.

లలిత శబ్ద చిత్రాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : భీమా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన లలిత శబ్ద చిత్రాలయాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో మారుతున్న కాలానుగుణంగా ఆడియో, విజువల్ బోధనకు అనువుగా ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.ఎస్. సురేంద్రబాబు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థలు పడ్డాం



గత కొన్నేళ్లుగా మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక అనేక అవస్థ లు పడ్డాం. వర్షం వస్తే ఇళ్ల ముందు మోకాళ్ల లోతు వరకు నీరు నిల్వ ఉండేవి. కనీసం కాలు మోపడానికి కూడా ఇబ్బంది పడ్డాం. వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చిన సందర్భాలు అనేకం. ఎమ్మెల్యే మా ఊరికి వచ్చి సమస్యను చూసి వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం సమస్య పరిష్కారమైంది. వర్షా కాలంలో నీరు బయటకు వెళ్లేలా కాల్వ నిర్మించడంతో మాకు అవస్థలు తప్పాయి. – మంగమ్మ, చిన్నపెండేకల్ గ్రామం

మురుగు కాలువలు ఏర్పాటు చేశారు



మా గ్రామంలో కొన్నేళ్లుగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నీరు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లేది. దీంతో చాలా ఇబ్బందిపడేవాళ్లం. మా కాలనీలో చాలా మంది అనారోగ్యం పాలయ్యారు కూడా. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మా గ్రామానికి వచ్చి సమస్యను తెలుసుకుని తక్షణమే రోడ్లు, మురుగు కాలువలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అయితే కాలువల పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేశారు. మాట నిలబెట్టుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. – రఘువీర్‌సింగ్, బైచిగేరి గ్రామస్తుడు

ముమ్మరంగా పనులు చేస్తున్నాం



మా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేసింది. ఆ పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు మంజూరయ్యాయి. చేసిన పనులకు బిల్లులు ఈ ప్రభుత్వంలో మంజూరు కావని ప్రతిపక్షాలు ఆరోపించారు. ఇది అబద్ధం. అంతేగాకుండా మా గ్రామంలో పైపులైన్లు, ఇంటింటికి కుళాయి కనెక్షన్ల పనులు కూడా పూర్తి చేశాం. బిల్లులు కూడా వెంటనే విడుదలయ్యాయి. ప్రస్తుతం వాటర్ ట్యాంకు పనులు చేస్తున్నాం.
– చిలక శంకరమ్మ, చిన్నపెండేకల్ గ్రామ సర్పంచ్

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- గడప గడప కార్యక్రమంలో సమస్యల గుర్తింపు
- ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు
- సీసీ రోడ్లు, డ్రైనేజీ, నీటి పైపులైన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఎంత మంది పాలకులు మారినా గ్రామాల సమస్యలను గాలికొదిలేశారు. దీంతో ప్రజలు సమస్యలతో సహజీవనం చేయడాన్ని అలవాటు చేసుకున్నారు. అయితే ఇందుకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఇందుకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఆ సమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామ,వార్డు సచివాలయానికి రూ.20లక్షలు కేటాయించారు. దీంతో పల్లెల్లో సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి.



చిన్నపెండేకల్‌లో పూర్తి అయిన సీసీ రోడ్డు



బైచిగేరిలో పూర్తి అయిన డ్రైనేజీ కాలువలు

ఆదోని రూరల్ : గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టి నిధులు మంజూరు చేస్తుంది. ఇందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టింది. గత నాలుగేళ్ల పరిపాలనలో ఇచ్చిన మాట మేరకు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే గాకుండా గ్రామాల్లో అభివృద్ధిని సైతం చేయాలనే ఉద్దేశ్యంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకోవడం, సమస్యలపై ఆరా తీయాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల విషయంలో అర్హులై ఉండి పథకాలు రాని వారికి కూడా పథకాలు అందేలా చూడాలని, అలాగే గ్రామాల్లో సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పడంతో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ఇంటిని సందర్శిస్తున్నారు. గ్రామాల్లో కలియదిరిగి సమస్యలను తెలుసుకొని అధికారుల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

26 సచివాలయాల్లో గడప గడపకు పూర్తి..

ఆదోని మండలంలో 44 గ్రామాలు, 35 సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం 26 సచివాలయాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయ్యింది. ఈ కార్యక్రమం ద్వారా సమస్యలను తెలుసుకుని ఆ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది.

తీరిన సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యలు..

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్ల సమస్యలు తదితరాలు పరిష్కరించబడ్డాయి. ప్రస్తుతానికి చిన్నపెండేకల్, పెద్దపెండేకల్, ఢణాపురం, బైచిగేరి, విరుపాపురం, బసరకోడు, అలసందగుత్తి, జాలిమంచి, నాగనాథనహళ్లి, కపటి, సుల్తానపురం, గణేకల్ గ్రామాల్లో అభివృద్ధి పనులు చివరి దశకు చేరాయి. మిగతా గ్రామాల్లో పనులు ప్రారంభించారు. వాటిని కూడా త్వరలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు కృషి



ఇప్పటి వరకు 26 సచివాలయాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యేతో కలిసి నిర్వహించాం. ప్రజలు తెలిపిన సమస్యల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర సమస్యలు పరిష్కారమయ్యాయి. త్వరలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర సమస్యలను పరిష్కరిస్తాం. – గీతావాణి, ఎంపీడీఓ, ఆదోని

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

పెద్దకడబూరు : మండలంలోని హెచ్.మురవణి గ్రామానికి చెందిన దాదాపు 40 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలోని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి స్వగృహంలో హెచ్.మురవణి నాయకులు పరమేష్, గోవిందు, ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి సమక్షంలో సోవారం పార్టీలో చేరగా.. వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ మరోసారి జగనన్న వస్తే రాష్ట్రం, గ్రామాలు ఎంతో అభివృద్ధి చెంది ప్రజలు సంతోషంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దకడబూరు సర్పంచ్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ సహాయకులు శశిశేఖర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, ఎస్సీ వెల్ఫేర్ సుధాకర్, ఆర్టీసీ డీఎం మహ్మద్‌రఫీ, వ్యవసాయశాఖ ఏడీఏ గిరిష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన జయలక్ష్మికి సర్వే నంబర్ 270లో 1.95 ఎకరాలు ఉంది. మా పొలంలోని 95 సెంట్లు భూమి వేరే వారి పేరుమీద ఆన్‌లైన్‌లో నమోదైందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.

2. ఆదోని పట్టణంలో పలు మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారని, మెడికల్ షాపులను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన నరసింహ అర్జీ అందజేశాడు.

3. ఢణాపురం నుంచి హొళగుందకు రోడ్డు పనులు పూర్తి చేసి గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని హొళగుంద మండలం యం.డి.హళ్లి గ్రామానికి చెందిన సుధాకర్ వినతి పత్రం ఇచ్చాడు.

4. గోనెగండ్ల మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన లక్ష్మికి సర్వే నంబర్ 111/2లో ప్లాట్ నంబర్ 270 ఇంటి స్థలం మూడు సెంట్లు ప్రభుత్వం వారు 2000లో ఇంటి పట్టా ఇచ్చాని, ప్రస్తుం నా ఇంటి స్థలానికి కొలతలు వేసి హద్దులు చూపించాలని అర్జీ అందజేసింది.

అభివృద్ధి పనులకు భూమి పూజ



సంతపేటలో పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

ఆదోని టౌన్ : మున్సిపాలిటీలో ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 4, 5, 25, 28 వార్డుల్లో మున్సిపల్ జనరల్ ఫండ్స్ నిధులు సుమారు రూ.కోటితో రోడ్లు, కాలువలు, కల్వర్టు పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు నగరూరు చంద్రశేఖర్‌రెడ్డి, మహ్మద్‌స్వామి, ఫయాజ్‌అహ్మద్, బాలాజీయాదవ్, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల పాల్గొన్నారు.

పశు బీమాను ఉపయోగించుకోండి

కౌతాళం: వైఎస్సార్ పశు బీమాను పశుపోషకులు ఉపయోగించుకోవాలని ఏడీ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం కౌతాళం పశువైద్యాధికారి జగదీష్‌తో కలిసి బాపురం గ్రామీణ పశువైద్యశాలను తనిఖీ చేశారు. ఏరిగేరి, తోవి గ్రామాల్లో జరిగిన గొర్రెల, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఎంఈఓ-2 నియామకం



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న రెండో ఎంఈఓ పీ.రామమూర్తి



జేబీఎం స్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ నాగేశప్ప

మంత్రాలయం : పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆర్.రాఘున్నను మంత్రాలయం-2 ఎంఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పెద్దకడబూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న పీ.రామమూర్తి పదవి మార్పు (కన్వర్షన్)లో భాగంగా ఎంఈఓ- 2గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాంపురం గ్రామానికి వెళ్లి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

కోసిగి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాధికారి -2గా నాగేశప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలోని పలు పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల నిండిన ప్రతి విద్యార్థి 1వ తరగతిలో అడ్మిషన్ చేయించాలని హెచ్‌ఎంలకు సూచించారు. నాడు-నేడు పనులను వేగవంతంగా చేసేలా పీఎంసీ చైర్మెన్‌లు, పాఠశాల హెచ్‌ఎంలు బాధ్యతలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వంలో 'వైఎంకే' విలీనం.. విద్యార్థుల సర్దుబాటు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

ఆదోని సెంట్రల్ : పట్టణంలోని వైఎంకేయిడెడ్ ఉన్నత పాఠశాల సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేశారు. గత ఏడాది జీవేశ్వర, టీజీఎల్‌వీ, అలమ్మ గంగమ్మ, విద్యానగర్, పొట్టిశ్రీరాములు, రాయనగర్ వంటి ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేసుకొన్న విషయం తెలిసిందే. అయా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించారు. అయితే గతేడాది ప్రాపర్టీ విషయంలో వైఎంకే పాఠశాల యాజమాన్యం తన నిర్ణయం చెప్పకపోవడంతో తరగతులు కొనసాగాయి. ఈ ఏడాది సిబ్బందిని మీరే తీసుకొని మా ప్రాపర్టీని వదిలివేయాలని ప్రభుత్వానికి చెప్పడంతో విద్యార్థులను సర్దుబాటు చేసే పనిలో పడ్డారు. పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులు, ఇద్దరు నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు. పాఠశాలలో7-10వ తరగతి వరకు 220 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వీరందరిని పురపాలక ఉన్నత పాఠశాల, అర్‌ఆర్ లేబర్ కాలనీలోని ఉన్నత పాఠశాల, అమరావతిలోని ఉన్నత పాఠశాల, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు.

విద్యార్థులను సర్దుబాటు చేస్తున్నాం

వైఎంకే ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను గత ఏడాదే ప్రభుత్వంలోకి వీలినం చేశారు. అయితే ఉపాధ్యాయులకు స్థానాలను కేటాయించక పోవడంతో అక్కడే పనిచేశాకె. ఈ ఏడాది పాఠశాల యాజమాన్యం అంగీకరించడంతో విద్యార్థులకు నష్టం కలగ కూడదని పట్టణంలోని వివిధ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తున్నాం.
– రత్నం, ప్రధానోపాధ్యాయుడు

విచారణ కమిటీ వేయాలి

ఆదోని అర్బన్ : పాముకాటు, తేలుకాటుకు గురై ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మృతిచెందిన భరత్, హైమావతిలపై మృతిపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాది లోకేష్‌కుమార్ మాట్లాడుతూ కొంతమంది వైద్యులు విధుల నిర్వహణలో అలసత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న దృశ్యం



హాజరైన విద్యార్థులు

పెద్దకడబూరు : స్థానిక కస్తూర్బా, ఆది ఆంధ్ర పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ సువర్ణల సునియం ఆధ్వర్యంలో చేపట్టి కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పదో తరగతిలో మొదటి, రెండు, మూడవ స్థానాలలో వచ్చిన వారికి రూ. 3వేలు, రూ. 2వేలు, రూ. వెయ్యి లతో పాటు మెడల్, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. కస్తూర్బా పాఠశాలకు చెందిన కే.రాజేశ్వరి, ఎం.రాజేశ్వరి, బి.ద్రాక్షవేణి, ఆదర్శ పాఠశాలకు చెందిన బి.విశాలాక్షి, యు.పవన్‌కుమార్, ఎం.ధీరజ్‌కుమార్‌రెడ్డి సత్కరించారు.

విద్యార్థులను ప్రోత్సహించడానికే పురస్కారాలు

కౌతాళం: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించడానికే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాల పేరిట పురస్కారాలు అందజేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పీఎంసీ చైర్మన్ వడ్డెరాముతో కలిసి విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. మొదటి బహుమతి జాగీదార్ షబ్బీర్‌హుసేన్‌కు రూ.3వేలు, రెండవ బహుమతి శిరీషాకు రూ. 2వేలు, మూడవ బహుమతి బండారి తేజా, ఆర్యన్‌ఈరన్నకు రూ.వెయ్యి నగదు, మెడల్, ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. హెచ్‌ఎం ఇమ్మానియేల్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ పాల్గొన్నారు.

23న జాబ్‌మేళా

ఆదోని సెంట్రల్: రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిఫ్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన స్థానిక ఆర్డిఫ్ సంస్థ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు కట్టా భాస్కర్ ప్రతాప్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో ఉండే గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిగ్ బాస్కెట్, ఐసీఐసీఐ నవభారత్ ఫర్టిలైజర్స్, శ్రీసిటీ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వివరాలకు సెల్ 9398407427, 9160302039,8919598468 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు రూ. లక్ష విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. నంద్యాల జిల్లా సంజామలకు చెందిన నరసప్ప, కుటుంబ సభ్యులు రూ.లక్షను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు బాండ్, స్వామి ప్రసాదం, శేష వస్త్రం అందజేసి సన్మానించారు.ఉప ప్రధాన అర్చకుడు పూజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాల ని ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. సోమ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు ప్రారంభించేలా చూడాలని చెప్పారు. అలాగే నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి వెంటనే బిల్లులు మంజూరువుతున్నాయని తెలిపారు.హౌసింగ్ ఏఈ గోపినాథ్‌వర్మ, ఇంజినీరంగ్ అసిస్టెంట్లు సూర్యప్రకాశ్‌రెడ్డి, జ్యోతిర్మయి, నూర్‌బాషా, సాయిఅపర్ణ, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్ : పట్టణంలోని అమరావతినగర్‌లో కొన్ని రోజులుగా చెత్తాచెదారం, పూడికతో నిండిపోయిన వాటర్ పంప్‌హౌస్ (సంపు) క్లీనింగ్ పనులను కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. మురుగునీటి వాసన వస్తుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు సంపును శుభ్రం చేయించామని ఆయన చెప్పారు. ఇక నుంచి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తామన్నారు. అలాగే..క్రాంతినగర్‌లో రోడ్లు, వరద నీటి కాలువను పరిశీలించారు. దండిగేరి కాలనీలో శానిటేషన్ పనులను పరిశీలించారు. వర్షాలు సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్లు, కాలువలు, కల్వర్టులను శుభ్రం చేయిస్తున్నామని చెప్పారు. ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

కౌతాళం: కుంటనహాల్ గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు జులేఖాబీ (72) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె భర్త గ్రామ సీనియర్ నాయకుడు ఇబ్రహీం సాబ్ ఈనెల 9న మృతి చెందగా పదిరోజుల్లోపే భార్య కూడా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇబ్రహీంసాబ్, జులేఖాబీ మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. వీరభద్రగౌడ్, బదినేహాల్ సింగల్ విండో అధ్యక్షుడు అత్రితనయగౌడ్, మాజీ సర్పంచ్ అమరేష్, మాజీ ఎంపీటీసీ బసవన్నగౌడ్, శివరాం, సర్పంచ్ పార్వతి నివాళులర్పించారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయండి

కౌతాళం: బదినేహాల్ గ్రామం శివారులోనున్న కంబళితాత దర్గా సమీపంలోని బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న, నాయకులు వులిగయ్య, శంకర్ కోరారు. సోమవారం బ్రిడ్జి వద్ద నిరసన తెలిపారు. గతేడాది అధిక వర్షాల వల్ల బ్రిడ్జి కూలిపోవడంతో నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. వర్షా కాలం వస్తుండడంతో రైతులు పొలాలకు వెళ్లడానిక ఇబ్బందిగా ఉందని చర్యలు చేపట్టాలని కోరారు.

వ్యక్తిపై దాడి

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన శంకర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఐదుగురు ఆటోలో తీసుకెళ్లి దాడి చేసి ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డుపై పడేసి వెళ్లారని త్రీటౌన్ సీఐ నరసింహరాజు సోమవారం తెలిపారు. దాడి గల కారణాలను తెలుసుకునేందుకు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నామని చెప్పారు. కాగా బాధితుడిని స్థానికులు వెంటనే ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.